

ప్రకాశంలో బస్సు ప్రమాదం

ప్రకాశం జిల్లా బస్సు ప్రమాదంలో జిల్లా వాసులు గాయపడ్డారు. బస్సును లారీ ఢీకొట్టింది.

- 8లో





పిడుగుపాటుకు మహిళ మృతి

పిడుగుపాటుకు ఓ మహిళ మృతి చెందారు. కొత్తూరు మండలంలో ఘటన జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

పోక్సో కేసుల్లో పురోగతి సాధించాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: పోక్సో కేసుల్లో పురోగతి సాధించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అడిషనల్ ఎస్పీ కేవీ రమణతో కలిసి సమీక్షించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలలో ఫిర్యాదు పొందిన వెంటనే కేసు రిజిస్టర్ చేసి సమగ్రంగా కేసులు దర్యాప్తు చేపట్టాలన్నారు. కేసులు పెండింగ్‌లో ఉంటే కారణాలు తెలుసుకుని దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోక్సో, మహిళా చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దుంపల లక్ష్మణరావు



నూతన కార్యవర్గంతో అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణరావు, రవిశేఖర్, హరిసింగ్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు (రామారావు మాస్టారు) ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశంతోపాటు నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా దుంపల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా కె.రవిశేఖర్, కోశాధికారిగా నర్సింగరావుతోపాటు మిగిలిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో హ్యాండ్‌బాల్‌కు పూర్వవైభవం తీసుకువద్దామని నూతన అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు బ్లూప్రింట్ తయారు చేయాలని సూచించారు.

జవహర్ నవోదయ 12వ తరగతి ఫలితాలు విడుదల

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలు విడుదల చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



ఈ బిల్లు చూడండి. అంబళ్లవలస రీచ్ నుంచి ఇసుక కొనుగోలు చేసి, లారీల ద్వారా విశాఖపట్నం తరలిస్తున్నట్టుగా జారీ చేసిన బిల్లు ఇది. ఆ బిల్లు అధికారికంగా జారీ చేసింది కాదు. అక్రమార్కులు సొంతంగా తయారు చేసుకున్న బిల్లు ఇది. ఇదే బిల్లుతో విక్రయాలు, రవాణా సాగిస్తున్నారు.



ఈ బిల్లు చూడండి. ఆమదాలవలస మండలంలోని ముద్దాడ పేట ఇసుక రీచ్‌లో కొనుగోలు చేసి, తరలిస్తున్నట్టుగా చూపిస్తున్న బిల్లు ఇది. ఇది కూడా నకిలీదే. నకిలీ బిల్లుతో కొత్తవలసకు లారీ ద్వారా ఇసుక తరలిస్తున్నారు.

ఇచ్చట.. సునాయాసంగా.. కబళిస్తున్నారు



ఈ ఫొటోలో ఉన్న లారీలను చూడండి. నకిలీ బిల్లులతో ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి. పైడి భీమవరం చెక్ పోస్టు వద్ద సోమవారం అర్ధరాత్రి దాటాక ఆకస్మిక తనిఖీలు చేయగా, నకిలీ బిల్లులని అనుమానంతో లారీలను పోలీసు అధికారులు నిలిపేశారు. పట్టుకున్న లారీలను మైనింగ్ అధికారులకు పోలీసులు అప్పగించారు.

- జిల్లాలో భారీగా ఇసుక దోపిడీ
- ఉచితం ముసుగులో ఇసుక స్వాహా
- నకిలీ డివైజ్‌లతో బిల్లులు సృష్టిస్తున్న వైనం
- తాజాగా పైడిభీమవరంలో బయటపడిన నకిలీ బిల్లులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లాలో ఇసుక దోపిడీ పతాక స్థాయిలో జరుగుతోంది. అనుమతుల్లేకుండా ర్యాంపులు నిర్వహించి, అడ్డగోలుగా తవ్వకాలు జరిపి విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల అనుమతులు ఒక దగ్గర, తవ్వకాలు మరో చోట జరిపి ఇసుకను స్వాహా చేస్తున్నారు. కొన్ని చోట్ల అనుమతులకు మించి తవ్వకాలు జరిపి, సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలు ఒక ఎత్తు అయితే ఆ అక్రమ ఇసుకను తరలించేందుకు నకిలీ బిల్లులు సృష్టించడం మరో ఎత్తు. అంతా కలిసి ఇసుక మాఫియాగా మారి ఇప్పటికే రూ.వేల కోట్లు మింగేశారు. ఇసుక దోపిడీ నేరమని సాక్షాత్తు సుప్రీం కోర్టే చెప్పినా కూటమి ప్రభుత్వంలో నాయకులు లెక్క చేయడం లేదు.

అడ్డగోలుగా...

ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. నదుల గర్భంలోనే యంత్రాలు పెట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మంచినీటి బావులు, వంతెనలకు ముప్పు వాటిల్లేలా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమార్కుల దెబ్బకు కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మరికొన్ని చోట్ల తవ్వకాలతో ఏర్పడిన గుంతల కారణంగా సముద్రం బ్యాక్ వాటర్ వచ్చేసి నదీ జలాలు ఉప్పునీటిమయమైపోయాయి. మరికొన్ని చోట్ల నదులను ఎక్కడికక్కడ తవ్వేసి, పెద్ద పెద్ద గోతులు చేయడంతో ప్రమాదాలకు తావిస్తున్నాయి. కొన్ని చోట్ల నదులు దీవుల్లా కన్పిస్తున్నాయి. అక్రమ రవాణా సాగిస్తున్న లారీలతో రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. ఇప్పటికే ఎంతోమంది రోడ్లు పాడవడం వల్ల ప్రమాదాలకు గురై మరణించడం, తీవ్రగాయాలపాలవ్వడం జరిగింది.

నకిలీ బిల్లుల సృష్టి



బిల్లులు లేకపోతే ఆకస్మిక తనిఖీల్లో ఎక్కడ పట్టుబడిపోతామో అన్న ముందు చూపుతో అక్రమార్కులు ఎక్కడికక్కడ యంత్రాంగం వినియోగిస్తున్న డివైజ్‌లను పోలిన డివైజ్‌లను కొనుగోలు చేసి నకిలీ బిల్లులు తయారు చేస్తున్నారు. అధికారులు జారీ చేసిన బిల్లుల్ని పోలిన విధంగా నకిలీ బిల్లులు ఉంటున్నాయి. ఏ ర్యాంపు నుంచైతే తీసుకొస్తున్నారో ఆ ర్యాంపు లేదా మరో ర్యాంపు పేరుతో నకిలీ బిల్లులు సృష్టిస్తున్నారు. దాదాపు అక్రమంగా ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ జిల్లాలో నకిలీ డివైజ్‌లు వాడుతున్నారు. నకిలీ డివైజ్‌లతో బిల్లులు సృష్టిస్తున్నారని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇసుక దందా చేస్తున్న వారంతా నాయకులు కావడంతో వారి జోలికి పోవడం లేదు. దీంతో తనిఖీల సమయంలో సిబ్బంది కూడా గుర్తించలేకపోతున్నారు. యంత్రాంగం జారీ చేసిన బిల్లులు మాదిరిగా ఉండటంతో వదిలేస్తున్నారు. పక్కాగా గమనించి, ఆ ర్యాంపు వద్ద ఆరా తీసి, కచ్చితంగా వ్యవహరిస్తే తప్ప పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. తాజాగా పైడిభీమవరం చెక్ పోస్టు పక్కాగా, కచ్చితంగా పరిశీలించడంతో నకిలీ బిల్లులతో రవాణా సాగిస్తున్న లారీల గుట్టు రట్టు అయింది. సీఐ అవతారం ఆధ్వర్యంలో తనిఖీలు జరగ్గా, పట్టుబడ్డ లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించారు.

ఇసుక దోపిడీ జరుగుతున్న ప్రాంతాలివే

జిల్లాలో ఆమదాలవలస నియోజకవర్గంలోని తొగరాం పంచాయతీ దిబ్బలపేట, ముద్దాడ పేట, కాఖండ్యాం, నారాయణపురం, పురుషోత్తపురం, చినంకలాం, నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, నైరా, అంబళ్లవలస. శ్రీకాకుళం నియోజకవర్గంలోని భైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, గార. నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక,లుకలాం, బుజ్జిపేట, చేనువలవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బిర్లంగి, బొడ్డవడ, ఈదుపురం, కేసుపురం, కొలిగాం, ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో బహుద నది కొత్త, పాత బ్రిడ్జిల దగ్గర, పాతపట్నం నియోజకవర్గంలోని ఆకులతంపర, పాత పొనుటూరు, హిరమండలం మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, దోపిడీ జరుగుతోంది.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో భద్రతా దళాల విన్యాసాలు

అలర్ట్..అలర్ట్





మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ప్రయాణికులు

ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర సమయాల్లో ఎలా మసలుకోవాలో వివరిస్తూ మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర శాఖలు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ప్రమాదాన్ని పసిగట్టడం, ఎదుర్కోవడం, సమాచారం అందజేయడం, బాధితులను రక్షించడం వంటివాటిపై అవగాహన కల్పించారు.

– శ్రీకాకుళం అర్బన్



పింక్ మ్యాంగో

పెద్దమడి గురుకుల కళాశాల ఆవరణలో ఓ మామిడి చెట్టుకు నిండుగా కాయలు కాశాయి. ఇది సాధారణమే అయినా ఆ కాయలన్నీ గులాబీ రంగులో ఉంటూ తెగ ఆకర్షిస్తున్నాయి. అటుగా వెళ్తున్న వారు చెట్టు నుంచి చూపు తిప్పుకోలేకపోతున్నారు. – మెళియాపుట్టి

శ్రీముఖలింగం భూములకు సాగు వేలం ఖరారు



జలుమూరు: శ్రీముఖలింగం భూములకు సాగు వేలం ఖరారైంది. 'వేలానికి వేళ కాలేదా' అన్న శీర్షికన ఈ నెల నాల్గో తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్పందించారు. సుమారు 32 ఎకరాలు(మెట్టు,పల్లం) ఆలయ భూములకు సంబంధించి మంగళవారం బహిరంగ వేలం ప్రకటించారు. ఈ నెల 21వ తేదీన దేవదాయ శాఖ కార్యాలయంలో ప్రథమ ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. మొత్తం ఆరుబిట్లుగా విడదీసి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడేళ్లకు హక్కులు ఉంటాయని తెలిపారు.

- నరసన్నపేటలో రూ.కోట్లు విలువైన స్థలం కాజేసేందుకు కుట్ర
- బిల్డింగ్ సొసైటీ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం
- మంత్రి అచ్చెన్నాయుడు పేరు చెబుతూ బెదిరింపులు
- సొసైటీ నోటీసులు బేఖాతరు



వివాదాస్పద 26 సెంట్లు స్థలం

మేం అచ్చెన్నాయుడు మనుషులం..



వివాద స్థలంలో వేసిన పునాదులు



నరసన్నపేట: స్థానిక ఇందిరా నగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ పనులు అందరినీ విస్మయపరుస్తున్నాయి. నిబంధనల మేరకు ఇక్కడ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరగకూడదు. ఎలాంటి వాణిజ్యపరమైన నిర్మాణమూ చేపట్టకూడదు. కానీ విజయనగరానికి చెందిన ఓ బిల్డర్ ఈ పనులు చేపడుతున్నారు. స్థానిక సొసైటీ పాలక వర్గం సభ్యులు ప్రశ్నిస్తుంటే..'మేం మంత్రి అచ్చెన్నాయుడు మనుషులం.. మా వెనుక ఆయన ఉన్నారు' అని బెదిరిస్తున్నారు. మెయిన్ రోడ్డుకు సమీపంలో గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 204-1లో 1244 చదరపు అడుగుల్లో (26 సెంట్లు) అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోంది.

1948లో ఇందిరానగర్‌లో హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ ఏర్పడింది. కో ఆపరేటివ్ నిబంధనల ప్రకారం ఇది నడుస్తోంది. ఇక్కడ స్థలం పొందిన వారికి ఇల్లు కట్టుకోవడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. సామూహిక గృహాలు వంటి వాణిజ్యపరమైన నిర్మాణాలు చేయడానికి అనుమతులు లేవు. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నా ఇక్కడ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నారు. సొసైటీ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉన్నా తీసుకోలేదు. స్థలాన్ని ఇతరులకు మార్ట్‌గేజ్ చేయకూడదని నిబంధనలు చెబుతున్నా.. దాన్ని కూడా అతిక్రమించి మార్ట్‌గేజ్ చేశారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్..


ప్లాట్ నంబరు ఎ-8 లో ఉన్న స్థలాన్ని గొందు రామన్న అనే వ్యక్తికి 1980లో కేటాయించారు. కానీ ఆయన సకాలంలో రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో టంకాల గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రామన్నకు అలాట్ చేసిన స్థలాన్ని రద్దు చేశారు. అయితే 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న టంకాల అర్జున్‌ను అధికార పార్టీ నాయకులు బెదిరించి ఆ స్థలాన్ని రామన్న పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించారు. కానీ దీనికి పాలకవర్గం అనుమతి తీసుకోలేదు. అలాగే పాలకవర్గం తీర్మానం కూడా లేదు. దీంతో ఆ రిజిస్ట్రేషన్ చెల్లదని ప్రస్తుతం అధ్యక్షుని హోదాలో ఉన్న చింతు రామారావు రిజిస్ట్రార్ కార్యాలయానికి లెటర్ పంపారు. ఇదే సమాచారాన్ని రామన్నకు కూడా తెలియజేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ స్థలంపై కొందరి కన్ను పడింది. ఎలాగైనా ఈ స్థలాన్ని పొందాలని సబ్ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి చేసి విజయనగరానికి చెందిన బిల్డర్‌కు రామన్న చేత మార్ట్‌గేజ్ చేయించారు.

నిబంధనలు ధిక్కరిస్తున్నారు



ఇందిరానగర్‌లోని మా సొసైటీ స్థలంలో అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇక్కడ ఇల్లు కట్టుకోవడానికి మాత్రమే అనుమతి ఉంది. ఇతరులకు మార్ట్ గేజ్ చేయడానికి, అపార్ట్‌మెంట్ నిర్మాణానికి వీలు లేదు. కానీ నిబంధనలు ధిక్కరించి పనులు చేస్తున్నారు. అసలు మార్ట్‌గేజ్ చేసిన వ్యక్తికి ఈ స్థలంపై ఎలాంటి హక్కులు లేవు. సుడా అధికారులు కూడా స్థలం చూడకుండా పూర్వాపరాలు చూసుకోకుండా అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తున్నాం.

– చింతు రామారావు, కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు


DECLARATION

I verified the E.C. pertaining to the above schedule property. In view of the new provision under section 22-B (Central Act 16 of 1908) vide Andhra Pradesh Ordinance No.7 of 2016, dated 03.11.2016 the above schedule property is my self acquired property [illegible]

రిజిస్ట్రేషన్ సమయంలో డిక్లరేషన్ వివరాలు

దీంతో ఆయన అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు పనులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేదు. ఈ అపార్ట్‌మెంట్‌లో పొరుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులకు వాటాలు ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

నలుగురిపై గృహ హింస కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామానికి చెందిన అనిత ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు మంగళవారం ఆమె భర్త ముత్యాలరావు, ముగ్గురు కుటుంబ సభ్యులపై గృహహింస కేసు నమోదు చేశారు. భార్యభర్తలు మధ్య ఇటీవల గొడవలు రావడం, భర్త అప్పులు చేయడం, కన్నవారి ఇంటి నుంచి డబ్బులు తీసుకు రావాలని ఒత్తిడి తీసుకురావడం వంటి కారణాలతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2019లో అనితకు వివాహం కాగా, కుమార్తె ఉంది. ప్రస్తుతం కన్నవారు ఇంటి వద్ద దుప్పలవలసలో ఉంటోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 అంబులెన్సులో ప్రసవం



జన్మించిన శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

మందస: మండలంలోని సింగుపురం గ్రామానికి చెందిన రాయవలస భారతి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు మంగళవారం జన్మినిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. భారతి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వారి బంధువులు 108కు సమాచారం అందించారు. దీంతో మందస 108 సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ ఎస్.రాజేంద్ర ప్రసాద్‌లు గ్రామానికి హుటాహుటిన చేరుకున్నారు. అనంతరం ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గ మధ్యలో పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో ఆమెకు సిబ్బంది ప్రసవం చేయడంతో ఆడ శిశువుకి జన్మనిచ్చింది. అనంతరం హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన చిన్నారమ్మ

కొత్తూరు: మండలంలోని దిగువ మల్లెలుగూడకు చెందిన యువతి సవర చిన్నారమ్మ (30) పిడుగుపాటుకు మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ మంగళవారం తెలియజేశారు. చిన్నారమ్మ మేకలు కాపుకు వెళ్లగా సోమవారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి తమ్ముడు సవర రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

కారు బోల్తా

రణస్థలం:మండలంలోని విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు పైడిపేట జాతీయ రహదారిపై మంగళవారం బోల్తా పడింది. అయితే కారులో ఉన్నవారికి చిన్న,చిన్న గాయా లు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడినప్పుడు జాతీయ రహదారిపై నీరు నిలబడిపోవడం వలన కారు బోల్తా పడిందని, తరుచూ ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. దీనిపై జేఆర్‌పురం పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.



ఔషధ గుణం..

ఆరోగ్య ప్రదం

- తాటి ముంజులతో శరీరానికి పుష్కలంగా విటమిన్లు
- వేసవిలో డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం
- కామెర్లు, ఎసిడిటీ తీవ్రతను తగ్గించే గుణం



ముంజలను విక్రయిస్తున్న రైతు

వజ్రపుకొత్తూరు / హిరమండలం:

వేసవి తాపాన్ని అధిగమించేందుకు, ఈ కాలంలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతులను నివారించి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన వరం తాటి ముంజులు. ఇవి ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. తాటి ముంజుల సీజన్ ప్రారంభం కావడంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ తాటి ముంజులు శరీరంలోని చెక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి గిరాకీ పెరిగింది. ఇదివరకు గ్రామీణ ప్రాంతాల్లో తాటిచెట్లు అధికంగా ఉండేవి. అయితే ప్రస్తుతం రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటి చెట్లు నరికేస్తుండడంతో భవిష్యత్‌లో ఇవి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన ఉంది.

ఆరోగ్య ప్రదాయిని

ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే తాటి ముంజులు కల్తీ లేనివి, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో తాటి ముంజులు సేకరించేవారు కరువయ్యారు. దీంతో మైదాన ప్రాంతాల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతు కూలీలు తాటి ముంజులను పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. జిల్లాల్లోని శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, హరిపురం, ఇచ్ఛాపురం పట్టణాల్లో ఎక్కువగా విక్రయాలు చేపడుతున్నారు. తాటి ముంజుల పరిమాణాన్ని బట్టి డజను రూ.80ల నుంచి రూ.120ల వరకు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా తాటి ముంజుల ప్రియులు విశేషంగా కొనుగోలు చేస్తున్నారు.



తాటిముంజులు

ప్రయోజనాలు

- తాటి ముంజుల్లో విటమిన్లు, పాస్పరస్, థయామిన్, బీ–కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు సోలేబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల డీహైడ్రేషన్‌ల నుంచి ఉపశమనం లభిస్తుంది. వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. వికారం, వాంతులను నివారిస్తుంది.
- తాటి ముంజులు తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు రక్తపోటు(బీపీ)ను అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా సీజన్లో క్రమం తప్పకుండా తాటి ముంజలను తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకుని మంచి కలెస్ట్రాల్‌ను వృద్ధి చేసుకోవచ్చు.
- వీటిలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో పోషకాలు ఉండడం వలన అలసట, నిర్జలీకరణం నుంచి ఉపశమనం కల్పించి శరీరం బరువు పెరగకుండా చేస్తుంది.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గించి, జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది.
- ఆహారంలో సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటీ, ఉదర సంబంధ సమస్యల నివారణకు దోహదపడుతుంది.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్ నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది



తాటి ముంజులు మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. లేతవి, జెల్లీలా ఉన్నవి తింటే రుచిగా ఉంటాయి. మా ఊరులో ఉన్న చెట్లు నుంచి గెలలను తీసి కోసుకుని తింటాం. పైగా వేసవిలో చల్లదనం ఇచ్చి దాహార్తిని తీరుస్తుంది. సరదాగా గడుపుతూ తోటల్లోకి చేరి, కొండ పక్కన ఉన్న తోటల్లో తాటిచెట్లు నుంచి కాయలను తీసి పంచుకుని తింటాం. అదో తియ్యని జ్ఞాపకం.

– డి.ఢిల్లీరావు , అమలపాడు, వజ్రపుకొత్తూరు

ఏడాదికి ఒక్కసారైనా తినాలి



తాటి ముంజ కల్తీలేని స్వచ్ఛమైన పోషకాహారం. వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభం వరకు తాటి ముంజులు లభ్యమవుతాయి. ఇవి తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందనడంలో సందేహం లేదు. మా ప్రాంతంలో కోసేవారు లేకపోవడంతో ఇచ్ఛాపురం, హరిపురం పలాస, టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి తెప్పించుకుని తింటాం. కొన్నిసార్లు పలాస– విశాఖ పాసింజర్ ట్రైన్లలో సైతం విక్రయాలు చేస్తుంటారు. అలాంటి సమయాల్లో ఎక్కువ తీసుకుంటాం. ఐస్ యాపిల్‌గా పిలిచే తాటి ముంజలను ఏడాదికి ఒకసారైనా తినాలని కోరిక ఉంటుంది.

– ఎం.కృష్ణారావు, బ్రాహ్మణతర్ల, పలాస

- తాటి ముంజులను గుజ్జుగా చేసి ముఖానికి పూతలా వేస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమట కాయలను నివారిస్తుంది. ఎండ వేడిమికి ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది. పోషకాలు అధికంగా ఉండడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచి ఎసిడిటీ, కామెర్ల తీవ్రతను తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

తస్మాత్ జాగ్రత్త..!



- పెరుగుతున్న పిడుగుపాటు ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న పిడుగులు
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు



పిడుగుపాటుకు మృతి చెందిన మేఘన(ఫైల్)



పిడుగుపాటుకు మృతి చెందిన అప్పన్న (ఫైల్)

సరుబుజ్జిలి: వేసవిలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలో ఇటీవల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. అయితే పలుచోట్ల పిడుగులు పడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మనుషులతో పాటు మూగజీవాలు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో పిడుగు మాట వింటేనే ప్రజలు భయపడుతున్నారు. పొలాల్లో పనులు చేసుకొనే రైతులు, పశువుల కాపరులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే సమీప ప్రాంతాల్లో ఇళ్లకు సమీపంలో పిడుగులు పడుతుండడంతో గృహోపకరణాలు కాలిపోయి తీవ్ర నష్టాలు ప్రజలు చవిచూస్తున్నారు. దీంతో పిడుగుపాటు ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి పలు సూచనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇలా చేయకూడదు

- వర్షం కురిసేటపుడు చెట్లకింద ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల్లో ఉండరాదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్న తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలోపు పిడుగుపడే అవకాశముంది.
- మెరుపు కనబడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతుల్లో సెల్ ఫోన్లు లేకుండా చూసుకోవాలి, సెల్‌ఫోన్ ఉంటే స్విచ్చాఫ్ చేయాలి.
- ఒక వేళ ఇవి ఉంటే రేడియస్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశముంటుంది.
- వర్షంపడే సమయంలో విద్యుత్ తీగలు కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు.
- అలాగే అటువంటి సమయాల్లో చెప్పులు లేకుండా బయటకు వెళ్లరాదు.

ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడిబట్టలు తీసివేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను 1 అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించాలి.

– బమ్మిడి జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ

- గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు మెరుపులు, ఉరుములతో భయందోళనకు గురవుతారు. అటువంటి వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

మత్స్యకార గ్రామాల్లో కూటమి చిచ్చు



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- కక్ష సాధింపులకు ప్రతి చర్యలు తప్పవు
- అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు సరికాదు
- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్

సంతబొమ్మాళి: ప్రశాంతంగా ఉండే మత్స్యకార గ్రామాల్లో కూటమి పార్టీలు చిచ్చుపెడుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. మండలంలోని జగన్నాథపురం తీరప్రాంత గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామంలో అక్రమ కేసుల బాధితులైన సర్పంచ్ జోగి రాములమ్మ, ఉప సర్పంచ్ కొమర రామారావు, లండ రామారావులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ఎదుటివారిని భయభ్రాంతులను గురి చేస్తున్నారన్నారు. మహిళ సర్పంచ్ జోగి రాములమ్మపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు గొడవపడితే ఎటువంటి సంబంధం లేని వైఎస్సార్‌సీపీ నాయకులపైన, ఆ సమయంలో గ్రామంలోనే లేని సర్పంచ్ రాములమ్మపైన అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు.

సీఐ నిర్వాకంతోనే అక్రమ కేసులు

టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు నిర్వాకం వలనే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దయ్యబట్టారు. మంత్రి అచ్చెన్నాయుడు తమకు కావాల్సినవారిని అన్ని శాఖల్లో నియమించుకొని తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకు చెందిన నాయకులను ఆర్థికంగా నష్టపరిచేలా వ్యవహరిస్తున్నారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పుడు పనులు చేసే అధికారులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఆర్థికంగా నష్టపరిచినా, అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా పార్టీకి అండగా నిలిచిన సర్పంచ్ రాములమ్మ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆదర్శమని కొనియాడారు. టీడీపీ నాయకుల దాడులకు ప్రతిచర్య తీవ్రంగా ఉంటుందన్నారు. కింజరాపు కుటుంబీకులు అక్రమంగా సంపాదించిన వేల కోట్లను జిల్లా ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రామిరెడ్డి, ఎన్ని మన్మథరావు, చింతల రాజులు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపతిరావు హేమసుందర రాజు, అట్ల రాహుల్, సత్తారు సత్యం, కాళ్ల సంజీవరావు, పుక్కల లక్ష్మణరావు, మురళి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ ఎన్‌ఎంయూ నాయకుల డిమాండ్




డీపీఆర్‌వో కార్యాలయ ముట్టడి చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేవీఆర్ నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు పీఆర్‌కే రావు, జిల్లా కార్యదర్శి వై.అప్పయ్యలు కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని డీపీటీవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలని, 114 జీవోలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150ల నుంచి రూ.400ల వరకు చెల్లింపులు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని విన్నవించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఉన్న విధంగానే క్యాడర్‌ను బలోపేతం చేయాలని, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. డిప్యూటేషన్లను యథావిధిగా కొనసాగించాలని, పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలని కోరారు. ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, రిటైర్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలను అనుమతించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఆన్ కాల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలతో పాటు టెక్కలి, పాలకొండ తదితర డిపోల నుంచి ఎన్‌ఎంయూ నాయకులు ఎంఎస్ రావు, పి.నవీన్ బాబు, ఎంఆర్ మూర్తి, కె.నర్సింహులు, పి.వాసు, హెచ్‌వీ మూర్తి, జేఆర్ రావు, వీడీరావు, వీరబాబు, సూరిబాబు, పీఆర్ మూర్తి, పీవీ లక్ష్మి, కృష్ణవేణి, పార్వతి పాల్గొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు



శ్రీకాకుళం రూరల్: గురజాడ విద్యాసంస్థల్లో మూడు దశాబ్దాలుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పులఖండం శ్రీనివాసరావు అంత్యక్రియలు మంగళవారం స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడుతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఒక సాహితీవేత్తను, పరిపాలన దక్షుడిని కోల్పోవడం బాధగా ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వీరితో పాటు విద్యాసంస్థల డైరెక్టర్ రంగారావు, వి.మహేష్, ఐక్యూఏసీ మర్తాండ తదితరులు సంతాపం ప్రకటించారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే వంతెన కింద గంజాయితో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశామని రణస్థలం సీఐ అవతారం మంగళవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. వాండ్రంగి గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు, శ్రీకాకుళం వాంబే కాలనీకి చెందిన యారగళ్ల పవన్ కుమార్‌లు ద్విచక్రం వాహనం ద్వారా 2 కేజీల 300 గ్రాముల గంజాయి తరలించేందుకు ఉండగా స్థానిక ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. అలాగే గంజాయి విక్రయిస్తున్న కరిజాం లచ్చన్న, మీగడ గోపిల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నాని వెల్లడించారు. వీరిని త్వరలోనే అరెస్టు చేసి విచారిస్తామన్నారు.

ప్రకాశం జిల్లాలో బస్సు ప్రమాదం

- క్షతగాత్రుల్లో జిల్లాకి చెందిన ముగ్గురు వ్యక్తులు

పోలాకి: ప్రకాశం జిల్లా తిమ్మనాపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. చెన్నై నుంచి వస్తున్న బస్సు ఎదురుగా ఉన్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే ఉత్తరాంధ్రకు చెందిన ఎరువుల డీలర్లను కేపీఆర్ కంపెనీ మహాబలిపురంలో ఈనెల 12వ తేదీన జరిగిన బిజినెస్ మీటింగ్‌కు మూడు బస్సుల్లో తీసుకెళ్లింది. తిరిగి వస్తుండగా అందులో ఒక బస్సు ప్రమాదానికి గురైంది. కేపీఆర్ కంపెనీ శ్రీకాకుళం ప్రతినిధి కృష్ణప్రసాద్‌తో పాటు నరసన్నపేట, సంతకవిటికి చెందిన ఇద్దరు డీలర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు.